
దీపావళి కథల పోటీలో రూ.500 బహుమతి పొందిన కథ

# నిర్ణయం

"ఉమ"



చదువుకుంటున్న పుస్తకం ప్రక్కన పెట్టి 'ఇదుగో విన్నే' అంటూ భార్యని పిలిచాడు జానకి రామయ్య. లోపల నట్టింట్లో కూర్చుని రుక్మిణితో బియ్యంలో రాళ్ళు ఏరుతున్న విశాలాక్షమ్మ ఆ పిలుపు విని 'ఓయ్ వస్తున్నా' అంటూ లేచి నిలబడి వాకిట్లో వాలుకుర్చీలో కూర్చున్న జానకి రామయ్య దగ్గరకి వెళ్ళి 'ఏమిటి' అంది.

ఆయన మెల్లిగా 'నాకు తినటాని కేదయినా కావాలి' అన్నాడు.

'అస్తమానూ తినటాని కేం వుంటుంది. ఇప్పుడేకదా భోజనంచేశారు' అంది విశాలాక్షమ్మ కొంచెం విసుగ్గా.

'నాకు ఆకలి వేస్తూంది' అన్నాడు జానకి రామయ్య.

విశాలాక్షమ్మకి చిరాకు కలిగింది. ఆవిడ పెద్దగొంతుతో 'అవును మీకిమధ్య ఆకలి ఎక్కువవుతోంది. ఏంలేదని చెప్తే అర్థం చేసుకోరే. ఒక్కడి సంపాదనమీద ఇల్లు గడుస్తూంది. మనుషులం ఎంత కష్టపడుతున్నామో మీకేమయినా తెలుస్తూందా. మరీ కుర్రాడయిపోతున్నా రీమధ్య. మీకంటే కృష్ణుడే నయం. 'లేదురా' అంటే అర్థం చేసుకుని వెళ్ళిపోతాడు' అంది.

అత్తగారి గొంతు విని రుక్మిణి తలుపు చాటుకివచ్చి 'మీరు ఇలా రండి అత్తయ్యా' అంది

జానకి రామయ్య కుర్చీలోంచి లేచి నిలబడి తువ్వాలు భుజంమీద వేసుకుని 'అవును నువ్వు ఉందని ఎప్పుడన్నావు. ఎప్పుడూ లేదని ఏడుపే. మొద్దుమొహం' అంటూ వీధి గుమ్మంలోనుంచి బయటికి నడిచాడు.

విశాలాక్షమ్మ లోపలికివెళ్తూ 'చూడమ్మా ఈయన అల్లరి. రోజురోజుకీ పసివాడయిపోతున్నారు. ఓరోజు జంతికలంటారు, మరోరోజు పాయసం కావాలంటారు, మరోరోజు సినిమా చూస్తానంటారు. వీటన్నిటికీ డబ్బెక్కడనుంచి వస్తుంది. ఒక్క సంపాదనిమీద ఇల్లు గడవాలా. పైగా వేసే ఆ కోమటి గుమాస్తా ఉద్యోగంకూడా మానేశారు. ఏదైనా అంటే నాకొడుకు రెండు చేతులా సంపాదిస్తున్నాడు. పడ్డకష్టాలు ఎలాగూ పడ్డాను. కనీసం ఇప్పుడయినా అనుభవించాలి. ఇంకెవడికిందా పనిచెయ్యను' అంటారు. వాడికొచ్చే మాటయాభైరూపాయలతో ఈ సంసారం ఎలా గడుస్తుందంటే వినరు. అంతా నా ఖర్మ' అంది.

'ఊరుకోండత్తయ్యా! ఆయనకి మాత్రం తెలియదేమిటి. పాపం నిజంగా ఆకలి వేస్తూందేమో' అంది రుక్మిణి.

విశాలాక్షమ్మ ఒకసారి మూతి ముడిచి బియ్యం ముందు కూలబడి, అందులోని రాళ్ళు ఏరటంలో నిమగ్నురాలయింది.

రుక్మిణి వీధిలోకి వచ్చి మామగారు ఎటు వెళ్తున్నది చూసింది. ఆయన అలవాటు ప్రకారంగానే సముద్రంవైపు వెళ్ళసాగాడు. ఆమె ఒకసారి నిట్టూర్చి వీధితలుపు దగ్గరగా వేసి, వచ్చి అత్తగారి దగ్గర కూర్చుంది.

* * *

జానకి రామయ్య మెల్లిగా నడుస్తూ

సముద్రం ఒడ్డుకి చేరాడు. తను ఇల్లు సముద్రం ఒడ్డునే వుండటంవల్లనూ, చిన్నతనంనుంచీ ఆ ఒడ్డునే గడపటంవల్లనూ ఆయనకి సముద్రం అన్నా, దానిచుట్టూ వాతావరణమన్నా విపరీతమయిన ఇష్టం.

దూరంగా జాలరివాళ్ళు ఇసుకలో కూర్చుని చిరిగిపోయిన వలలు సరిచేసుకుంటున్నారు. ఆయన బద్ధకంగా ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని శిథిలాలయి పోయిన డచ్చివారి మేడలవైపు నడవసాగాడు.

మేడల ప్రక్కన డచ్చివారి సమాధులు వున్నాయి. అప్పుడప్పుడు గేటుతీసివుంటే జానకిరామయ్య ఆ సమాధులలోకి వెళ్ళి ఎవరెవరు ఎప్పుడు చచ్చిపోయారో చూస్తుంటాడు, 'పాపం ఎక్కడివాళ్ళో ఎక్కడ చావు రాసి పెట్టుంది.' అనుకుంటుంటాడు.

జానకిరామయ్య ప్రక్కనుంచి వెళ్ళుతుండటం చూసి ఓ బెస్తవాడు 'ఓ చుట్టుంటే ఇప్పించండి బాబో' అన్నాడు. వెంటనే మరొకడు 'ఛస్ గమ్మునుండొరే బాబుగారు సుట్టలు కాల్చరు' అన్నాడు. ఆయన వాళ్ళవైపు ఓసారి చూసి, డచ్చివారి మేడ ప్రహరీగోడ దగ్గరగా వెళ్ళి, ఓ రాయి మీద కూర్చుని, దూరంగా వున్న సాగర సంగమం కేసి చూడసాగాడు. ఆయన కూర్చున్నస్థలానికి కొద్దిదూరంలో బెస్తవారి పిల్లలు చెడుగుడు ఆడుతున్నారు. ఆయన వాళ్ళ ఆట చూస్తూ ఏదో ఆలోచించసాగాడు.

* * *

ఇంట్లోకి వస్తూనే పుస్తకాలగంచీ మూలకి విసిరేసి 'అమ్మా తినటానికి పెట్టేశావు' అన్నాడు కృష్ణుడు. విశాలాక్షమ్మ తలెత్తి 'ఇదుగో ఆ తాతకి మనవడు' అంది. రుక్మిణి మెల్లిగా 'ఏంలేదురా' అంది.

'తాతయ్యకి కూడా ఏం పెట్టలేదా' అన్నాడు కృష్ణుడు.

'ఊహూ' అంది రుక్మిణి.

'నాకు నిజంగా ఆకలేస్తూంది. మధ్యాహ్నం కూడా ఏం తినలేదుకదా.'

విశాలాక్షమ్మ ఓసారి తలెత్తి చూసి, ఏం మాట్లాడకుండా తనపనిలో నిమగ్నురాలయింది.

రుక్మిణి లేచి నిలబడి 'ఉండు అటుకులయినా వున్నాయేమో చూస్తా'నంటూ



దీపాల తోరణం (ఫోటో: శ్రీ ఆర్. ఉదయభాస్కర్)

## దివ్వెల రవ్వలు

ఇవి దివ్వెలు— ఇవి రవ్వలు
రజనికి దివ్వెల రవ్వలు
నేలతల్లి తలపువ్వులు
నిశాచరుల ఎదచువ్వలు
ఈ చీకటి వాకిటలో
దూసిన వేకువ బాకులు
ఖేటక నాటిక సత్యా
భ్రుకుటీ ముకుళిత రేఖలు
సత్రాజితి సారించిన
శింజని మ్రోగిన మువ్వలు
అరిభంజన సమయంలో
నెత్తుట దోగిన పువ్వులు

చరిత్ర సత్యం చాటెడి
విజయేందిర అందియలివి
మానవతను వెలికి తెచ్చు
భువితారా తోరణాలు
నరకాసుర వారసులను
కదిపిన బంగారు గువ్వలు
అరుణారుణ దీధితితో
చెదిరిన శౌర్యపు రవ్వలు
కన్నతల్లి పెదవులపై
చెన్నొందిన చిరునవ్వులు
అందమైన ఆగామికి
ఇవి దివ్వెలు— ఇవి రవ్వలు.

—పైడిపాల

వంటింట్లోకి వెళ్ళింది. డబ్బాలు వెదుకుతే కాసిని అటుకులు కనిపించాయి.

'ఈ అటుకులు వేయించి కారంచల్లి ఇయ్యి. తాతయ్య నేనూ తింటాము' అన్నాడు కృష్ణుడు.

రుక్మిణి వేయించి ఇచ్చింది.

కృష్ణుడు కొంచెం నోట్లో పోసుకుని మిగతాది పొట్లంకట్టి బయటకి పరు గెత్తాడు.

'ఒరేయ్ క్రిష్ణా తాతయ్య సముద్రం ఒడ్డుకి వెళ్ళారు' అంది రుక్మిణి వెనుక నుంచి. 'నాకు తెలుసు' అన్నాడు కృష్ణుడు.

ఇసుకలో పరిగెట్టుకుంటూ వెళ్లి దూరంనుంచే 'తాతయ్యా' అంటూ పిలి చాడు కృష్ణుడు. జానకిరామయ్య వెనక్కి తిరిగిచూసి లేచి నిలబడ్డాడు. కృష్ణుడు ఆయన దగ్గరకి వచ్చి 'నీకోసం వేయించిన అటుకులు తెచ్చాను. రా తిందాం' అన్నాడు. ఆయన వాడికేసి ఆప్యాయంగా చూసి 'పద' అన్నాడు. ఇద్దరూ బోర్లగించిన ఓ పడవ ప్రక్కన కూర్చుని పొట్లంవిప్పి అటుకులు తినసాగారు.

'తాతయ్యా ఇవాళ స్కూల్లో మా మాష్టారు ఓ పద్యం చెప్పాడు. అసలేమీ అర్థం కాలేదు. మళ్ళీ చెప్పమంటే, కసిరి 'కావాలంటే మా యింటికొచ్చి ప్రైవేటు చెప్పించుకో లేకపోతే మీ తాతతో చెప్పించుకో' అన్నాడు.

'ఏడిశాడు నేను చెప్తానులే నీకు' అన్నాడు జానకిరామయ్య.

సముద్రం అలలు పొయ్యంత్రమవుతున్న కొద్దీ ఎగిసెగిసి పడుతున్నాయి. తాత మనవలిద్దరు సముద్రంకేసి చూస్తూ కూర్చున్నారు. మధ్యమధ్యలో కృష్ణుడు కొన్ని అటుకులుతీసి చుట్టుచేరిన కాకులకి విసరసాగాడు. అటుకులు అయిపోగానే 'నేను వెళ్ళి ఆడుకోవాలి తాతయ్యా. శీనుకి వాళ్ళబావ కొత్త బేటు కొన్నాడు' అంటూ కృష్ణుడు వెళ్ళిపోయాడు. మరి కొంతసేపు అక్కడే కూర్చుని సంధ్య చీకట్లు పడుతూంటే ఇల్లు చేరాడు జానకి రామయ్య.

* ● ●

రాత్రిభోజనం పూర్తికానిచ్చి అరుగు మీద మంచంపై నడుం వాల్చాడు జానకి రామయ్య. ఎదురుగావున్న ఇన్‌స్పెక్టరుగా రింట్లో గోడగడియారం ఎనిమిదిగంటలు కొట్టింది.

జానకిరామయ్య మస్తిష్కంలో ఏవేవో ఆలోచనలు రేగసాగాయి. ఆయన తన గతం ఎలా గడచినదీ గుర్తు తెచ్చుకోసాగారు.

# నిర్ణయం

ఆయన జీవితం చిన్ననాటినుంచి చాలా కష్టాలలో గడిచింది. తండ్రిజబ్బుతో ఉన్న ఇల్లుతప్ప ఆయనకేమీ మిగలలేదు. కొన్నాళ్ళకి జబ్బుతో తండ్రి మరణించాడు. అప్పటికి ఆయన స్కూలు ఫైనలు పాస య్యాడు. ఆ తర్వాత స్నేహితులు, శ్రేయోభి లాషలు సహాయంతో టీచరు ట్రెయినింగు పూర్తిచేసి విజయనగరంలో ఓ స్కూలులో ఉపాధ్యాయుడుగా చేరాడు. కొన్నేళ్ళకి ఆయన పెళ్ళయింది. స్వంతఇల్లు వదిలి పరాయివూళ్ళో వేరే ఇల్లు అద్దెకి తీసుకుని కాపురం పెట్టే స్తోమత లేక ఆయన తల్లిని, భార్యనిఉన్న ఊళ్ళోనేవుంచి తను మాత్రం ప్రతి మూడురోజులకోసారి, సెలవు దినాలప్పుడు సైకిలుమీద ఇంటికి వస్తుండే వాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ పెరిగే ధర లతో ఆయన ఆర్థిక పరిస్థితి మరింత క్రుంగిందేకాని బాగుపడలేదు. ఆయన ఏవేవో చిల్లరపనులుచేసి నెలకి ఐదూ, పదీ సంపా దించేవాడు. విజయనగరంలో బంధువుల ఇంట్లో, వరండాలో ఓమూలవుంటూ, వండుకుంటూ కాలం గడిపాడు. ఆయన ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుండేది.

జానకిరామయ్యకి కొడుకుపుట్టాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ముద్దూ ముచ్చటా ఆయన తీర్చలేకపోయాడు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ కుర్రవాడికి కూడా ఆ యింటి పరిస్థితులు అర్థమవ సాగాయి.

విన్నో దరఖాస్తులు పెట్టుకున్న తర్వాత జానకిరామయ్యకి స్వంతవూరు భీమునిపట్నంకి బదిలీ అయింది.

కొడుకుని పెద్ద చదువులు చదివించి, అతడు పెద్ద ఉద్యోగస్తుడు అయితే తను వృద్ధాప్యంలో సుఖపడవచ్చుని ఆశించిన జానకి రామయ్యకి నిరాశ ఎదురయింది. ఆయన కొడుకు సుందరశివరావు స్కూల్ ఫైనల్‌తో చదువాపేసి, 'ఇంటి పరిస్థితులు ఇలా వుండగా పై చదువులు చదవను' అని ఖచ్చితంగా చెప్పేసి చిట్టివలసలో ఓ మిల్లులో గుమాస్తాగా చేరిపోయాడు.

కొన్నేళ్ళకి సుందరశివరావు పెళ్ళ యింది. రుక్మిణి కాపురానికొచ్చింది. కృష్ణుడు పుట్టాడు. రిటైరయ్యేసరికి జానకిరామయ్యకి తన పాత జీవితమే ఎదు రుగా కనిపించింది. కొడుకుకి వచ్చే జీతం తోనే ఇల్లు గడపాలి.

'కొడుకు పెద్ద ఉద్యోగంచేసి తనని ఉద్ధరిస్తాడనుకొన్న' ఆశ ఆయనని వెక్కి రించసాగింది. ఆయనకి ఉక్రోషం జీవితం మీద కసి ఏర్పడ్డాయి. 'నేనింతవరకూ ఎప్పుడు సుఖపడ్డాను' అని ఆయన తనని తాను ప్రశ్నించుకున్నాడు. చివరికాయన బలవంతంగానయినా కోర్కెలు తీర్చుకోవా లని ప్రతివిషయానికి మారాము పైటం మొదలుపెట్టాడు.

ఆయన మనస్తత్వం ఆయన మొదటి నుంచి పడిన కష్టాలు తెలిసిన సుందర శివరావు తండ్రి అడిగినవన్నీ ఏదోవిధంగా సమకూర్చేవాడు. కాని విశాలాక్షమ్మకి మాత్రం భర్త ధోరణి బొత్తిగా నచ్చేది కాదు.

ఆలోచిస్తున్న జానకిరామయ్య సైకిలు చప్పుడు విని కళ్ళు మూసుకుని కదల కుండా పడుకున్నాడు. సుందరశివరావు ఇంటి ముందు సైకిలు దిగి, వరండాలో సైకిలు ఉంచి లోపలికి వెళ్ళిపోయాడు. ఎదురింటి గడియారం పదిగంటలుకొట్టింది.

కాసేపటికి లోపల్నుంచి విశాలాక్షమ్మ కొడుకుకి అన్నం వడ్డిస్తూ—

'ఇంత ఆలస్యమయిందేరా' అని అడి గింది.

'మిల్లులో పని తగిలిందమ్మా. తర్వాత ట్యూషన్ కుర్రాళ్ళకి పరీక్షలు వస్తున్నాయి కదా. వాళ్ళకి ఏదో లెక్కలు తెలియకపోతే చెప్తూవుండిపోయాను' అన్నాడు సుందర శివరావు. తర్వాత 'నాన్న నిద్రపోయా రామ్మా' అని అడిగాడు.

'ఆ! నిద్రపోయేవుంటారు. చంపేస్తు న్నారనుకో ఇది కావాలని అది కావాలని. లేదంటే కోపం' అంది విశాలాక్షమ్మ.

'పోనీలేమ్మా. అడిగిని కనీసం ఈ వయ సులోనయినా ఆయనని సుఖపడనియ్యి'

'ఏమి సుఖమో' అంటూ నిట్టూర్చింది విశాలాక్షమ్మ.

జానకిరామయ్య ఈ మాటలు వింటూ

మువ్వటి స్తైకి లాక్కుని ఎదురుగా వున్న కొబ్బరిచెట్లు, చందమామ, సముద్రం అలలను చూడసాగాడు. కాసేపటికి ఆయనకి నిద్రపట్టింది.

* *

'కృష్ణుడి వళ్ళు కాలిపోతూంది. జ్వరం బాగా వున్నట్టుంది. వచ్చేటప్పుడు ఏదయినా మందు వ్రాయండి,' అంది రుక్మిణి. 'అలాగే' అన్నాడు సుందరశివరావు సైకిలుమెట్లు మీదుగా క్రిందకి దింపుతూ.

'ఊరంతా మాయదారి జ్వరాలు నాయనా. ముందుగా డాక్టరుకి చూపించాలి. లేకపోతే తర్వాత కష్టపడవలసివస్తుంది,' అంది విశాలాక్షమ్మ.

'అలాగే అమ్మా' అంటూ సుందర శివరావు సైకిలు ఎక్కి మిల్లుకి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం ఆ వీధిలో ఇన్‌స్పెక్టరు గారి ఇంటికివచ్చిన డాక్టరు సుందర శివరావు చెప్పటం మూలంగా వాళ్ళ యింటికి వచ్చి కృష్ణుడిని పరీక్షించాడు.

'సందేహం లేదు ఇది పేరా టైఫాయిడ్. ఊళ్ళో అంతా చాలా ఎక్కువగావుంది. మీరు కుర్రవాడిని జాగ్రత్తగా చూసుకోవాలి' అన్నాడు.

'అయ్యో దేవుడా! నేను మొదట్నించి అనుకుంటూనేవున్నాను' అంది విశాలాక్షమ్మ.

# నిర్ణయం

'మీరంతా భయపడవలసినదేమీ లేదు. మందులు, ఇంజక్షనులు వ్రాసిస్తాను. తెప్పించి వాడండి. తగ్గిపోతుంది' అంటూ ఓ కాగితంమీద వ్రాసిచ్చాడు డాక్టరు.

రుక్మిణి కృష్ణుడి తలదగ్గర దిగులుగా కూర్చుండటం చూసి 'మీరేం భయపడకండమ్మా తగ్గిపోతుంది. నేను రెగ్యులర్‌గా వచ్చి చూస్తుంటాములెండి' అన్నాడు డాక్టరు.

రుక్మిణి తలెత్తి కృతజ్ఞతా పూర్వకంగా ఓసారి చూసింది.

డాక్టరు తన మెడికల్ చెస్ట్ తీసుకుని బయటకి నడిచాడు. గుమ్మంలో, అంత వరకూ సముద్రతీరంలో తిరిగి వచ్చిన జానకిరామయ్య ఎదురుపడ్డాడు.

'నమస్కారం మాష్టారూ! బావున్నారా!' అంటూ పలకరించాడు డాక్టరు,

'ఆ!' అన్నాడు జానకిరామయ్య. డాక్టరు వెళ్ళిపోయాడు.

జానకిరామయ్య ఇంట్లోకి వస్తూనే భార్యని ఉద్దేశించి 'డాక్టరు మనింటి కెందుకు వచ్చాడు' అన్నాడు.

'కృష్ణుడికి టైఫాయిడ్‌ట' అంది విశాలాక్షమ్మ.

ఆమాట విని ఆయన కృష్ణుడు పడుకున్న గదిలోకివెళ్ళి కాసేపు వాడినిచూసి ఏం మాట్లాడకుండావచ్చి అరుగుమీద కూర్చుని ఎదురుగావున్న సముద్రంకేసి చూడసాగాడు.

* * *

జానకిరామయ్య అరుగుమీద కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ప్రక్కింటి శీను పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'ఏమిట్రా శీనూ సంగతి' అన్నాడాయన.

శీను ఆయాసపడుతూ 'మరేమోనండీ తాతగారూ పట్టీవలసకి. సర్కసొచ్చింది. స్కూలు కుర్రాళ్ళందరం పొద్దున్నవెళ్ళి ఏనుగులు, లొట్టిపిట్టలు, గుర్రాలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు అన్నీ చూసి వచ్చాము. సర్కసులో అమ్మాయి జీపు, మోటారుసైకిలు నడిపిస్తూ జంప్ చేయిస్తుందట. ఇంకా ఏవేవో ఫీట్లున్నాయిట' అంటూ కృష్ణుడి గదిలోకి పరుగెత్తాడు.

జానకిరామయ్య గదిలో జరుగుతున్న కుర్రవాళ్ళ సంభాషణ వినసాగాడు. శీను తాను చూసిన వింతలూ, విశేషాలు చిలవలు, పలవలుగా కృష్ణుడికి చెప్తున్నాడు. తను రెండురోజుల్లో సర్కసుకి వెళ్ళబోతున్నట్టు కూడా చెప్పాడు.

కృష్ణుడు దిగులుగా 'నేనెలారా సర్కసు చూసేది. ఈ జ్వరం తగ్గాలి కదా. అప్పటి వరకూ సర్కసు వుంటుందో లేదో' అన్నాడు.


'సర్కసు వుంటుంది లేరా. ముందు నేను చూసొచ్చి నీకన్నీ చెప్తాను. నీ జ్వరం తగ్గాక మనిద్దరం మళ్ళీ చూద్దాము' అన్నాడు శీను.

కృష్ణుడు మాట్లాడలేదు.

శీను సర్కసు వింతలు మిగతా స్నేహితులకి చెప్పటానికి వెళ్ళిపోయాడు.

జానకిరామయ్య మెదడులో ఒంటెలు, ఏనుగులు, పులులు, సింహాలు ఎలుగుబంట్లు, సైకిళ్ళ మీద అమ్మాయిలు, జీపులో అమ్మాయి సర్కసు చేయసాగారు. ఆయన తను చిన్ననాట చూసిన సర్కసు గుర్తు తెచ్చుకోసాగాడు. తర్వాత మెల్లిగా 'అవును చాలా ఏళ్ళయింది. సర్కసు చూడాలి' అనుకున్నాడు. ఆయనకి ఏదో తెలియని హుషారు కలిగింది.

* * *



ఆదివారం ఉదయం జానకిరామయ్య భార్యనిపిల్చి 'నేనివాళ సర్కసు మ్యాట్నీ చూస్తాను' అన్నాడు.

'ఏమిటీ!' అంది విశాలాక్షమ్మ.

'ఇవాళ సర్కసు మ్యాట్నీ చూస్తాను.'

'డబ్బెక్కడిది. ఇంటిఖర్చు ఈమధ్య కృష్ణుడి జ్వరంతో పెరిగిందికదా. పైగా ఇలా నెల మధ్యలో సర్కసులు, సినిమాలు అంటే డబ్బెక్కడనుంచొస్తుంది' అంది విశాలాక్షమ్మ.

'నేనివాళ సర్కసు చూడాలి' అన్నాడు జానకిరామయ్య.

విశాలాక్షమ్మలో సహనం చచ్చిపోయింది. ఆవిడ పెద్దగొంతుతో 'ఉదయానే నాచేత కేకలెందు కేయిస్తారు. అస్తమానూ డబ్బు అంటే ఎక్కడినుంచొస్తుంది. మన పాతు ఇక్కడేదయినా ఉందా అస్తమానూ త్రవ్వి తెచ్చుకోడానికి' అంది.

ప్రక్క గదిలోంచి సుందరశివరావు గుమ్మం దగ్గరికి వచ్చి 'అమ్మా నువ్విలా రా!' అన్నాడు.

కొడుకుని చూడగానే జానకిరామయ్య చివాలునలేచి నిలబడి 'ఛీ వెధవ బ్రతుకయిపోయింది' అంటూ భుజంమీద తువ్వాలు వేసుకుని బయటకి నడిచాడు.

'నాన్ననేమీ అనకమ్మా' అన్నాడు సుందరశివరావు చొక్కా తొడుక్కుంటూ.

'నీకేం తెలియదురా! నువ్విలా ఊరుకున్నావనే ఆయన ఆడింది ఆట పాడింది పాటగా వుంది' అంది విశాలాక్షమ్మ.

'పోనీలేమ్మా' అన్నాడు సుందరశివరావు. సైకిలు వరాండాలో నుంచి బయటకి నడిపిస్తూ 'ఇవాళ మిల్లులో ఓవర్‌టైము ఉందమ్మా. వచ్చేసరికి ఆలస్యం అవుతుంది. మీరందరూ భోజనం చేసెయ్యండి' అన్నాడు.

రుక్మిణి వంటింటి గుమ్మం దగ్గరికి వచ్చి 'వచ్చేటప్పుడు కృష్ణుడి మందు మర్చిపోకుండా పట్టండి. రేపటితో మందు అయిపోతుంది' అంది.

'అలాగే' అంటూ సుందరశివరావు సైకిలు ఎక్కాడు.

విశాలాక్షమ్మ వీధి తలుపువేసి కృష్ణుడి గదిలో వాడిదగ్గర కూర్చుంది.


* *

సుందరశివరావు సైకిలు రోడ్డుమీద ఆపి. దూరంగా డచ్చినారి బిల్డింగుల అవతల రాళ్ళమీద కూర్చుని నీటిలోకి చిన్నచిన్న రాళ్ళు విసురుతున్న తండ్రిని చూసి, మెల్లిగా అటువైపు నడవసాగాడు.

జానకిరామయ్య తల వెనక్కి త్రిప్పి దగ్గరగా వస్తున్న కొడుకునిచూసి చేతిలో రాళ్ళు నీటిలో విసిరేసి మౌనంగా కూ...
న్నాడు.

సుందరశివరావు దగ్గరకి వచ్చి
అంటూ పిల్చాడు. జానకిరామ...
త్రిప్పాడు. 'మీకేదయినా కావాలం...
గండి. ఇవాళ సర్కసుకి వెళ్ళండి
జేబులోనుంచి ఐదు రూపాయల ...
తండ్రికిచ్చాడు. జానకిరామయ్య ...
కుండా ఆ నోటు అందుకున్నాడు
శివరావు వెనక్కి తిరిగాడు. అతడి
తండ్రి తననేం అడగడని. అయి...
సారీ అతడిమాట అంటూనే వుం...

ఐదురూపాయిల నోటు చేతిలో...
కుని జానకిరామయ్య కొద్ది క్షణా...
లంగా నిలబడ్డాడు. ఆయన ...
తను చేసేపని సరయినాదేనా ...
రేగసాగింది. ఇంతలో ఆయనకి




FDSAS. 1800 TS

ఫలాలు, సింహాలు, ఏనుగులు, ఒంటెలు వగైరా కళ్ళముందు ఆడాయి. ఆయన ఒక్కసారి హుషారుగా నడవసాగాడు.

* * *

సర్కసులో జానకిరామయ్య సంతోషానికి అంతులేకపోయింది. ఆయన ప్రతి ఫీటూ కళ్ళు పెద్దవి చేసుకుని చూడసాగాడు. చిన్నపిల్లలుకూడా రకరకాలుగా మొగ్గలు వెయ్యటం, తీగమీద ఆడపిల్లలు నడవడం వగైరాలుచూసి ఆయన 'పాపం పిల్లలు చాలా కష్టజీవులు' అనుకున్నాడు. బఫూన్ పిల్లి మొగ్గలువేసి తమాషాలు చేస్తున్నప్పుడు ఆయన చిన్నపిల్లవాడిలా చప్పట్లు చరచసాగాడు. చుట్టూవున్న జనం తనని వింతగా చూడడంతో తన్నుతాను సంభాళించుకున్నాడు.

సర్కసు అయిపోయింది.

జానకిరామయ్య బయటకొచ్చి బజారు వెంబడి నడవసాగాడు. మిఠాయి దుకాణం చూడగానే ఆయనకి పకోడీలమీద మనసు పోయింది. ఆయన పకోడీలుకొని పొట్లం చేతిలో పట్టుకుని తన ఊరు వైపు నడవసాగాడు. సూర్యుడు పశ్చిమాద్రిన క్రుంకుతున్నాడు. సాయంకాలపు నీరెండ ఆహ్లాదంగా వుంది. 'ఇంటికి నడిచే వెళ్తాను. మూడుమైళ్ళేగా' అనుకున్నాడాయన. పకోడీలపొట్లం విప్పి హుషారుగా నడవసాగాడు.

చీకటి పడుతుండగా ఇల్లుచేరి స్నానం చేశాడు. విశాలాక్షమ్మ భోజనం వడ్డిస్తూ 'సర్కసు ఎలావుంది' అని అడిగింది.

'సర్కసుకేం బ్రహ్మాండంగా వుంది. నువ్వుకూడా రావాల్సింది' అన్నాడు జానకిరామయ్య.

'ఆ! అదొక్కటే తక్కువయింది' అంది విశాలాక్షమ్మ. ఆయన మారుమాట్లాడకుండా సీదా అరుగుమీది మంచంపై నడుం వాల్చాడు.

ఎదురింటి గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

జానకిరామయ్య దూరంగావున్న కొబ్బరి చెట్లు, చంద్రుడు, సముద్రంకేసి చూడసాగాడు. ఆయన మెదడులో సాయంత్రం తను చూసిన సర్కసు చిత్రాలే మెదులుతున్నాయి.

కాసేపటికి సుందరశివరావువచ్చి సైకిలు వరండాలో ఉంచి లోపలి కెళ్ళిపోయాడు.

కృష్ణుడి గదిలోనుంచి బయటకి వస్తున్న తల్లినిచూసి 'నాన్న పడుకున్నారామ్మా'అని అడిగాడు.

'ఆ! పడుకున్నట్టున్నారు' అంది విశాలాక్షమ్మ.

'సర్కసు కెళ్ళారా!'

'ఆ వెళ్ళొచ్చారు. ఆ సర్కసు చూసిన తర్వాత ఒకటే పొంగిపోతున్నారు' అంది విశాలాక్షమ్మ.

సుందరశివరావు పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కునివచ్చి భోజనంచేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

జానకిరామయ్యకి నిద్రపట్టటంలేదు. ఆయన మంచంమీద అటు ఇటు దొర్ల సాగాడు. ఎదురింటి గడియారం పదకొండు గంటలుకొట్టింది. ఆయన మంచంమీద నుంచి లేచి కూర్చుని కాలిపిక్కలను చేతితో మర్దనా చెయ్యసాగాడు. కాసేపటికి దాహం అనిపించి నీళ్ళకోసం లోపలికి వెళ్ళాడు.

కృష్ణుడి గది గుమ్మందగ్గర గడపమీద తలపెట్టుకుని విశాలాక్షమ్మ నిద్రపోతూంది. గదిలో ఓమూలగా కోడిగుడ్డు దీపం మసగమసగ్గా వెలుగుతోంది. ఆయన చప్పుడు చెయ్యకుండా మెల్లిగా గదిలోకి తొంగి చూశాడు. కృష్ణుడు నిశ్చలంగా నిద్రపోతున్నాడు. 'వెర్రికుంక ఎలాగయిపోయాడో' అనుకున్నాడు.

సుందరశివరావు గది తలుపులు వేసి వున్నాయి. వంటింటివైపు వెళ్ళబోతున్న జానకిరామయ్య కొడుకు గదిలో జరుగుతున్న సంభాషణ విని అప్రయత్నంగా ఆగిపోయాడు.

'అన్నట్టు కృష్ణుడిమందు తెచ్చారా' అడుగుతోంది రుక్మిణి.

'లేదు. ఉన్న ఐదురూపాయలు నాన్న సర్కసుకి వెళ్తానంటే ఇచ్చేశాను. సాయంత్రం ఆకలివేస్తే ఎవడిదగ్గరో రూపాయి అప్పుచేసి టిఫిన్ తిన్నాను.'

'మామగారు ఏమిటో విచిత్రంగా మారిపోతున్నారు.'

'పాపం ఆయన చాలా కష్టజీవి రుక్మిణీ. చిన్నప్పటినుంచి ఆయన స్వభావం నాకు బాగా తెలుసు. నేనేదో పెద్ద ఉద్యోగంచేసి ఆయనని ఉద్ధరిస్తానని అనుకునేవారు. ఆయన ఆశ నేను వమ్ము చేశాను. అందుకే ఇప్పుడు ఆయన ఏది కావాలంటే అది లభించేట్టు చూస్తున్నాను. ఆయన మాత్రం పెద్ద కోరికలు కోరుతున్నారా.'

'కృష్ణుడి మందు సంగతేం చేస్తారు.'

'రేపు ఎలాగో అలా డాక్టరుగారినే అడిగితెస్తాను. ఆయన చాలా మంచివాడు. పైగా వచ్చే నెలనుంచి వాళ్ళబ్బాయికూడా నా ట్యూషన్‌లో చేరబోతున్నాడు.'

'ఎవరికోసం ఇదంతా. మీ నాన్నగారి కోసమేనా. ఆయన కష్టజీవి అన్నారే. మరి మీరుమాత్రం కారేమిటి?'

'నాన్నపడిన కష్టం ముందు నా కష్టాలో లెఖ్ఖకాదు రుక్మిణీ! ఆయనకోసం ఏమైనా చెయ్యటానికి వెనుకాడను. వచ్చేనెల నుంచి ఉదయం రెండుగంటలు ప్రెస్సులో ప్రూఫ్‌రీడరు పనికి ఒప్పుకున్నాను. నెలకి నలభై రూపాయలు ఇస్తారు. ఏపని చేసయినాసరే నాన్నని సుఖంగా వుంచడమే నా ధ్యేయం.'

'ఈ లెఖ్ఖన రోజూ ఉదయం ఏనిమిది నుంచి, రాత్రి ఎనిమిది గంటలవరకూ పని చేస్తే మీ ఆరోగ్యం సంగతేంకాను. మీరే పనులు చెయ్యటానికి వీలులేదు. కావాలంటే నేనే ఇద్దరు ముగ్గురు పిల్లలకి ఇంట్లో హిందీపాఠాలు చెప్తాను. సరదాకి పాసయిన విశారద ఇందుకేనా పనికొస్తుంది.'

'పిచ్చి పిల్లా!'

జానకిరామయ్య మరి అక్కడ నిలబడ లేక పోయాడు. వడివడిగా అడుగులువేస్తూ వచ్చి తన మంచంమీద కూలబడ్డాడు. ఆయన చెవుల్లో, కొడుకు కోడళ్ళ సంభాషణ గింగురుమంటూంది. ఆయన కంటి ముందు ఏవో పొరలు కరిగిపోయినట్లని పించింది. ఆయన తలగడలో ముఖం దాచుకున్నాడు. ఆయన మెదడులో ఎన్నో భావాలు చెలరేగసాగాయి.

'నేను దుర్మార్గుడిని. నా సుఖంకోసం ఇంతమందిని కష్టపెడుతున్నాను. ఇది సుఖమా. ఛీ!!! నేనేదో కష్టపడ్డానని అనుకుంటున్నాను కాని నాకోసం ఇంత మంది కష్టపడుతున్నారు. ఆఖరికి పరాయి పిల్ల కోడలుకూడా నాకోసం ప్రైవేట్లు చెప్పటానికి సిద్ధపడుతూంది. ఈ మధ్య

తరగతి జీవితాలే ఇంత. నాకోసం నాకొడుకు వాడికోసం వాడికొడుకు ఈ విధంగా అందరూ కష్టపడుతూ పోవల్సిందే కానీ దీనికో మార్గంలేదా. ఈ లెఖ్ఖన నాకొడుకు ఎప్పుడు సుఖపడతాడు. వాడికోసం కృష్ణుడు చదువాపేసి గుమాస్తా అవుతాడు. ఈ చక్రం ఇలా పరిభ్రమిస్తూనే వుంటుంది. లేదు! ఇలా జరుగకూడదు! కనీసం నా కొడుకయినా వృద్ధాప్యంలో ఏ లోటు రాకుండా గడపాలి' అనుకున్నాడు. అప్రయత్నంగా ఆయన కళ్ళవెంబట కారిన కన్నీళ్లతో తలగడ తడిసిపోయింది.

ఆలోచిస్తూనే ఆయన నిద్రపోయాడు.

* * *

మర్నాడు ఉదయం విశాలాక్షమ్మ కాఫీ ఇచ్చే సమయానికి జానకిరామయ్య చిరిగిన గొడుగు గుడ్డకి కుట్లువేస్తున్నాడు. ఆవిడ ఏదో అనబోయి మౌనంగా ఊరుకుంది.

ఎనిమిది గంటలకే భోజనం ముగించాడు జానకిరామయ్య. తనపెట్టె ముందు ఉంచుకుని, తనకి ఉన్న ఒక్కగా నొక్క కాఫీపొడి రంగు చిరుగులకోటు, చత్వారపు కళ్ళజోడు బయటకి తీశాడు. చొక్కాని పంచెలో దోపి, పైన కోటువేసి ఒక్కక్షణం అద్దంముందు నిలబడి సంతృప్తిగా నవ్వుకుని గొడుగు తీసుకుని, వరండాలోవున్న తన పాత చెప్పులు ఒకసారి దులిపి తొడుక్కుని బయటకి నడిచాడు.

భర్త చర్యలు అర్థంకాక తెల్లబోయి చూడసాగింది విశాలాక్షమ్మ.

వీధి గుమ్మంలో మెట్లు దిగుతూ ఒకసారి వెనక్కి తిరిగాడు జానకిరామయ్య. విశాలాక్షమ్మ ద్వారబంధంవద్ద నిలబడి ఆయనవంకే చూస్తోంది.

'ఓసి పిచ్చిమొహమా! ఎందుకే అలా తెల్లబోయి చూస్తావు. నా బ్రతుకంతా కష్టంలోనే గడచిపోయింది. ఈ బ్రతుకు ఇలాగే వెళ్ళనీ. కనీసం నా కొడుకు జీవితమయినా హాయిగా వెళ్ళిపోవాలి. దానికి కృష్ణుడు పెద్ద చదువులు చదవాలి. పెద్ద ఉద్యోగస్థుడు కావాలి. అప్పటికి మనం ఎలాగూ వుండము. వాడు వాళ్ళ వాళ్ళని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి. అందుకే నేను మళ్ళీ ఆ కోమటి గుమాస్తా ఉద్యోగంలో చేరుతున్నాను. నాకు నెలనెలా వచ్చే యాభై రూపాయల్లో పాతిక రూపాయలు ప్రతినెలా బ్యాంకులో క్యుములేటివ్ డిపాజిట్లో వేస్తాను. కృష్ణుడు స్కూలు చదువు పూర్తిచేసేసరికి అది చేతికొస్తుంది. నాకోసం సుందరం ప్రెస్‌లో పని చెయ్యక్కర్లేదు, రుక్మిణి హిందీ ప్రైవేట్లు చెప్ప నక్కర్లేదు' అంటూ జానకి రామయ్య గొడుగువిప్పి మెట్లుదిగి చకచకా నడవ సాగాడు.

పెరట్లో స్నానంచేసి అప్పుడే ఇంట్లోకి వస్తున్న సుందరరావు, వంటింట్లోనుంచి పెరట్లోకి వెళ్ళబోతున్న రుక్మిణీ ఈ మాటలు వింటూ రాతి ప్రతిమల్లా నిలబడిపోయారు.

వాకిట్లో నిలబడ్డ విశాలాక్షమ్మ సజల నయనాలతో భర్త వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయింది.

# ఏమమ్మా దీపశిఖా!

డా॥ సి. నారాయణరెడ్డి



ఏమమ్మా దీపశిఖా!
ప్రేమిస్తున్నారు నిన్ను
పువ్వులా నవ్వేవారు
నవ్వలేక ఏడ్చేవారు
ఆగిపోతున్న గుండెకాయతో
అందంగా నిట్టూర్చేవారు.

ఉంది ఒకటి
చింతనిప్పుల కుంపటి.
ఉంది ఒకటి
చిత్రవర్ణాల చీకటి.
వాటినే గనక ప్రేమిస్తే
వాటి జ్వాలా నిశ్వాసాల
ఆటు పోటులతో
గుండెల సవ్వడులు పెనవేస్తే
నిర్భయంగా జీవిస్తారని
నిఖారస్సైన శిఖరాలమీద నిలుస్తారని
ఎంత మొత్తుకున్నా వినరే
ఏమిటీ పిచ్చి ఉన్మాదం?
ఏ ప్రమాదం లేని బ్రతుకును కాద్ని
ఎందుకు కోరుకుంటారో
ఈ పులిజూదం.

ఏ బిస్మిల్లాఖాన్ సన్నాయిరెక్కలమీదో
ఏ బాలమురళి స్వరతరంగాలమీదో
గాలి పటాల్లాగా
కాగితపు పడవల్లాగా
సరదాగా తేలిపోవచ్చునంటే
స్వర్గద్వారాలను పిలుకోవచ్చునంటే
నసేనా వినరే పిచ్చి.
రెక్కలు మాడినా సరే
కొవ్వొత్తే కావాలని
సాంతం మునిగినా సరే
సముద్రమే కావాలని

మొండికేసుకున్న వాళ్ళకు—
మొత్తం బ్రతుకును ఆహుతిక్కై
ముడుపు కట్టుకున్న వాళ్లకు—
ఎవ్వరేమి చెప్పినా ఉద్దండాలు
అనంతవేదనలు కాటువేస్తున్నా
ఆ హృదయ జీవులకు
ఆ ప్రియ భావులకు
ఇదే ఒక అచ్చతెనుగు దివ్వెలదండాలు